సర్కారు బడి.. ప్రవేశాల సందడి

- పాఠశాలల్లో జోరుగా అడ్మిషన్లు
- గత ప్రభుత్వంలో స్కూళ్ల అభివృద్ధి
- గ్రామాల్లో జోరుగా విద్యా ప్రవేశం కార్యక్రమం



సమగ్ర శిక్ష విడుదల చేసిన విద్యాప్రవేశం పోస్టర్



విద్యా ప్రవేశం పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గొల్లప్రోలు: ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలు పెంచేందుకు సమగ్ర శిక్ష అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వం మనబడి నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేసింది. పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించారు. విద్యా వ్యవస్థలో మార్పులు, ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం వంటి చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. దీంతో విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో సమగ్ర శిక్ష అధికారులు గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో పర్యటించి బడి ఈడు పిల్లలను నూరుశాతం పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలల్లో ప్రవేశాలు (ఎన్‌రోల్‌మెంట్) పెంచేందుకు సమగ్ర శిక్ష ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా నాలుగు వారాల పాటు అన్ని పాఠశాలల పరిధిలో 'విద్యా ప్రవేశం' పేరుతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కార్యచరణ రూపొందించింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ నెల 24 నుంచి జూలై 25 వరకూ విద్యా ప్రవేశం కార్యక్రమం కొనసాగుతోంది.

బడి ఈడు పిల్లలను గుర్తించి..

విద్యా ప్రవేశం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవాస ప్రాంతాల్లో బడిఈడు పిల్లలను గుర్తిస్తున్నారు. వారి వివరాలు సేకరించి ఒకటి నుంచి 8వ తరగతి వరకూ అర్హత ఉన్న పిల్లలను ఆ ప్రాంతంలోని ప్రభుత్వ బడుల్లో చేర్పిస్తారు. గ్రామాల్లోని బడిఈడు పిల్లలు బడిలో చేరేలా ప్రోత్సాహించేందుకు ఇప్పటికే ప్రభుత్వం నేను బడికిపోతా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. జూలై 12 వరకూ గ్రామాలు, పట్టణాల్లో ఈ కార్యక్రమం కొనసాగనుంది. 6–14 ఏళ్లలోపు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

విద్యా ప్రవేశం పోస్టర్ల విడుదల

విద్యా ప్రవేశంపై సమగ్రశిక్ష అధికారులు మూడు రకాల పోస్టర్లను విడుదల చేశారు. ఐదేళ్ల నిండిన విద్యార్థుల నమోదు విశ్లేషణ రికార్డులను అందుబాటులోకి తీసుకొచ్చారు. హ్యాండ్ బుక్, నిర్వహణ గైడ్‌ను అధికారులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంపై రాష్ట్రస్థాయి నుంచి మండలస్థాయి వరకూ విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పించారు.

698 మంది విద్యార్థులకు ప్రవేశాలు



గ్రామాల్లోని ఆరు నుంచి 14 ఏళ్లలోపు బడి ఈడు పిల్లలు నూరుశాతం బడిలో ఉండేలా కృషి చేస్తున్నాం. విద్యా ప్రవేశం కార్యక్రమంలో భాగంగా అధికారులు పాఠశాలలను సందర్శిస్తారు. మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఫొటో దీక్షయాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. మండలంలో ఇప్పటివరకు 698 మంది విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు.

– టీవీఎస్ ప్రసాద్
ఎంఈఓ–2, గొల్లప్రోలు

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చాలి



జె.తిమ్మాపురంలో అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న సిబ్బంది

పెద్దాపురం: బడి ఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో 'గ్రాడ్యుయేషన్ డే', 'నే బడికి పోతా' కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎస్.ఉమాదేవి అన్నారు. మండలంలోని జె.తిమ్మాపురంలో గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గ్యాడ్యుయేషన్ డే నిర్వహించారు. అనంతరం గ్రామంలో పాఠశాల సిబ్బందితో కలిసి నే బడికి పోతా కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఉమాదేవి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విద్యకు ప్రాధాన్యతమివ్వాల్సిన అవసరం ఉందన్నారు. బాల్యం నుంచే విద్యా బుద్ధులు నేర్పేందుకు నే బడికిపోతా కార్యక్రమం దోహదపడుతుందన్నారు. పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర వర్మ, ఏఎన్‌ఎం నాగమణి, లీలారాణి, పరంజ్యోతి, పాఠశాలల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'అనిశెట్టి'కి వంగా గీత పరామర్శ



లోవరెడ్డిని పరామర్శిస్తున్న గీత

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అనిశెట్టి లోవరెడ్డిని కాకినాడ మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నేత వంగా గీత గురువారం పరామర్శించారు. పితృ వియోగంతో బాధపడుతున్న లోవరెడ్డిని ఆయన నివాసంలో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు, అనిశెట్టి సుభాషిని, ఎరకం పెదబాబు రెడ్డి, రావుల మాధవరావు, పెనుమల్లు నారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

డయేరియాతో అప్రమత్తం



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శిస్తున్న ఇమ్యునైజేషన్ అధికారి

సామర్లకోట: జిల్లాలో వ్యాపిస్తున్న డయేరియాతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కె.రత్నకుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి అధికారులు గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల నుంచి వివరాలు సేకరించారు. స్థానిక కుమ్మర వీధికి చెందిన కాకరపల్లి శ్రీరామకృష్ణను డయేరియా అనుమానంతో ఆస్పత్రికి తీసుకురాగా వైద్యం అందిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ అమల డీఎంహెచ్‌ఓకు వివరించారు. పట్టణంలో డయేరియా కేసులు లేవని ఆమె స్పష్టం చేశారు. హెల్త్ సూపర్‌వైజరు సీహెచ్ శ్రీనివాసు, మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు, కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, మున్సిపల్ ఏఎస్‌ఓ పెంకే శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

200 మందికి కంటి పరీక్షలు



పీబీ దేవంలో కంటి పరీక్షలు చేస్తున్న కిరణ్ కంటి ఆస్పత్రి సిబ్బంది

సామర్లకోట: మండల పరిధిలో పీబీ దేవం శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి సిబ్బంది సహకారంతో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు చేసినట్టు సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు. సమితి సభ్యుడు టీవీవీ సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ శిబిరంఏర్పాటు చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన 40 మందిని ఎంపిక చేసి ప్రత్యేక వాహనంలో కాకినాడ తరలించారు. ఈ శిబిరాన్ని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ ప్రారంభించగా, కిరణ్ కంటి ఆస్పత్రి డాక్టరు శ్రీవల్లి ఆధ్వర్యంలో క్యాంప్ ఇన్‌చార్జి పర్యవేక్షణలో సిబ్బంది వైద్య సేవలందించారు.

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్, అధికారులు



కలెక్టర్‌ను కలిసిన కమిషనర్ వెంకటరావు

కాకినాడ సిటీ: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన షాన్ మోహన్ సగిలిని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, ఇతర అధికారులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో వివిధ విభాగాధిపతులతో కలెక్టర్‌ను కలిసిన కమిషనర్ వెంకటరావు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, స్మార్ట్ సిటీ సూపరింటెండెంట్ ఇంజినీరు ఎం.వెంకటరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్ తదితరులు ఉన్నారు.

తాగునీటి పరీక్షలు చేయాలి

బోట్‌క్లబ్: రాష్ట్రంలోని పలు పట్టణాలు, నగరాలు, గ్రామాల్లో డయేరియా ప్రబలమైనందున స్మార్ట్ సిటీలో డివిజన్ల వారీగా తాగు నీటి పరీక్షలు నిర్వహించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. పలు ప్రాంతాల్లో 40 శాతం కుళాయి గొట్టాలు మురుగు కాలువల్లో ఉన్నాయన్నారు. అత్యధిక ప్రాంతాల్లో 25 శాతం లీకేజీ సమస్య ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల వల్ల చాలా మంది మున్సిపల్ నీరు తాగడం లేదని, అధికారులు సత్వర చర్యలు చేపడితే అతిసార బెడద ఉండదని ఆయన అన్నారు.

తాగునీటి ట్యాంకులు శుభ్రం



సామర్లకోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించిన నాయకులు



కోట్లమ్మ చెరువు వద్ద ట్యాంకుల శుభ్రతను పరిశీలించిన కమిషనర్ తదితరులు

సామర్లకోట: స్థానిక కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న రెండు నీటి ట్యాంకులను గురువారం శుభ్రం చేయించినట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. కోట్లమ్మ చెరువు వద్ద ట్యాంకుల క్లీనింగ్ పనులను ఆయన పరిశీలించారు. ట్యాంకుల ఆవరణలో పెరిగిపోయిన తుప్పలను తొలగించే విధంగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సమీప ప్రాంతాల్లో డయేరియా కేసులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే గణపతినగరంలో ట్యాంకులను శుభ్రం చేయించగా కోట్లమ్మ చెరువు వద్ద ట్యాంకులు కూడా గురువారం క్లీనింగ్ చేయించామని తెలిపారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, వేడి పదార్థాలను తీసుకోవాలని, నిల్వ పదార్థాలు, ఈగలు వాలిన పదార్థాలను తీసుకోరాదని ఆయన సూచించారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

సామర్లకోట: అతిసార వ్యాధిపై ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా మానవహక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అతిసార రోగులు ఉండగా పట్టణంలో అసలు ఆ వ్యాధి లేదని చెప్పడం వింతగా ఉన్నదన్నారు. ఈ మేరకు గురువారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను సంఘం నాయకులు పరామర్శించారు. రోగులకు అందుతున్న సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ఫ్లెక్సీ తొలగించినందుకు వైఎస్సార్ సీపీ నాయకుడిపై కేసు



పంచాయతీ కార్యాలయం వద్ద బీజేపీ గుర్తులతో ఉన్న ఫ్లెక్సీ

సామర్లకోట: మండల పరిధిలోని మాధవపట్నం పంచాయతీ కార్యాలయం వద్ద బీజేపీ గుర్తుతో ఉన్న ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం సూచన మేరకు పార్టీ నాయకులు తొలగించారు. దాంతో వైఎస్సార్ సీపీ నాయకులతో టీడీపీ, బీజేపీ నాయకుల ఘర్షణ ఏర్పడింది. అధికార పార్టీ ఎమ్మెల్యే ఫ్లెక్సీ తొలగించారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్టీ గుర్తులతో పంచాయతీ కార్యాలయం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం ఏమిటని వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు మేడిశెట్టి బుజ్జి ప్రశ్నించారు. అందువల్లే దానిని తొలగించామని ఆయన తెలిపారు. అధికారం ఉందని తప్పుడు కేసులు పెడుతున్నారని మేడిశెట్టి బుజ్జి ఆరోపించారు. తొలగించిన స్థానంలో పంచాయతీ కార్యాలయ గోడ వద్ద తిరిగి ఆ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కాగ హుస్సేన్‌పురం పంచాయతీ కార్యాలయంపై టీడీపీ జెండాలు ఏర్పాటు చేసి తొలగించ లేదని పంచాయతీ ఉపసర్పంచ్ యవర్న చంద్రశేఖర్ ఆరోపించారు.

పేదలకు అన్నదానం

సామర్లకోట: పేదలకు సేవలందించడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఏర్పడిందని క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ తెలిపారు. దీనిలో భాగంగా పట్టణ పరిధిలోని సుమారు 60 మంది పేదలకు భోజనాలు అందజేసినట్టు ఆయన తెలిపారు. ఎటువంటి ఆధారం లేని వారికి భోజనం ప్యాకెట్లు అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు గుండు శంకరరావు పాల్గొన్నారు.

హార్బర్ నిర్మాణ పనుల పరిశీలన

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో మినీ హార్బర్ నిర్మాణ పనులను పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్బర్ నిర్మాణంలో మత్స్యకారులు ఒడ్డుకు చేరుకొనే మొగ ప్రాంతాన్ని సంక్రమంగా డ్రెజ్జింగ్ చేయకపోవడంతో బోట్లకు, మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. మత్స్యకారులకు ఎటువంటి నష్టం కలగకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో సక్రమంగా నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జ్యోతులు శ్రీనావాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు స్వచ్ఛమైన నీటిని తాగాలి



విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: విద్యార్థులు స్వచ్ఛమైన తాగు నీటిని తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామ కృష్ణయ్య అన్నారు. గురువారం మండల పరిధిలో పనసపాడు ఎలిమెంటరీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు సరఫరా చేస్తున్న తాగునీటిని ఆయన పరిశీలించారు. అదే విధంగా పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించి పాఠశాలలో తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ మేరకు పాఠశాలలోని విద్యార్థులకు అందుతున్న విద్యపై ఆరా తీసి పుస్తకాలను ఆయన పరిశీలించారు. ప్రతి రోజు అందజేస్తున్న రాగి జావను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో విద్యార్థులు బయట విక్రయించే తినుబండారాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచాలని సూచించారు. నేనుబడికి పోతా కార్యక్రమంలో భాగంగా బడి బయట పిల్లలు లేకుండా చూడవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదన్నారు.

కొనసాగుతున్న రాక్ సిరామిక్స్ కార్మికుల ఆందోళన



రాక్ సిరామిక్స్ గేటు వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ నుంచి తొలగించిన కార్మికులు గురువారం అర్ధ నగ్న ప్రదర్శన చేసి ఆ సంస్థ ముందు బైఠాయించారు. ప్రైవేటు పరిశ్రమల్లో కార్మికులను తొలగించే కార్యక్రమాన్ని మానుకోవాలని, వారికి సీఐటీయూ అండగా ఉంటుందని ఆ శాఖ జిల్లా ఉపాధ్యక్షుడు నీలపాల సూరిబాబు అన్నారు. గత 15 రోజు లుగా కార్మికులు ఫ్యాక్టరీ గేటు ఎదుట శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా యజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బుధవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయని తెలిపారు. తొలగించిన కార్మికులకు మూడు నెలల జీతాలు ఇస్తామని యజమాన్యం చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. తొలగించిన కార్మికులకు ఉద్యోగ వయసు దాటి పోవడంతో ఏ ప్యాక్టరీలోనూ ఉద్యోగం వచ్చే అవకాశం లేదన్నారు. తొలగించిన కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని చెప్పారు. కార్మికులకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, పట్టణ కార్యదర్శి సురేష్, పెద్దాపురం అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, ప్రజానాట్య మండలి కళాకారులు వీరరాజు, కృష్ణ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, రాజబాబు, సతీష్‌కుమార్, గంగాధర్, శివనారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



జి.రాగంపేటలో వాటర్ ట్యాంక్ వద్ద తాగునీటి పరీక్ష నమూనాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పెద్దాపురం ఎంపీడీఓ జి.ఉషారాణి అన్నారు. మండలంలోని జి.రాగంపేట, వడ్లమూరు, గోరింట గ్రామాల్లో మంచినీటి సరఫరా విధానంపై గురువారం మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్‌తో కలిసి ఆమె అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉషారాణి మాట్లాడుతూ వాతావరణ మార్పులను బట్టి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా తాగునీటి సరఫరా వల్ల వచ్చే వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు ట్యాంకులను పరిశుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలన్నారు. అనంతరం గ్రామంలో మంచి నీటి సరఫరా విధానంపై ఆరా తీసి, మంచినీటి నమూనాలను పరీక్ష చేయించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు రమేష్, కళ తదితరులు ఉన్నారు.

బియ్యం అక్రమ రవాణా నిరోధించాలి

- నిఘా పెంచాలని ఆర్డీఓ ఇట్ల కిశోర్ ఆదేశం
- తహసీల్దార్లు, పోలీసు అధికారులతో సమీక్ష

కాకినాడ సిటీ: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం అక్రమంగా రవాణా అవుతున్నట్టు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో నిఘా మరింత పటిష్టం చేయాలని ఆర్డీఓ ఇట్ల కిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం తహసీల్దార్లు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దారులు, పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చౌక ధరల దుకాణాలు, ఎండీయూ ఆపరేటర్లు, రైస్ మిల్లులపై విస్తృత తనిఖీలు నిర్వహించి, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. దీనికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, పోలీస్ సిబ్బంది సమన్వయంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆర్డీవో వివరించారు. కౌలు రైతుల సాగు హక్కు ధ్రువపత్రాలు నిర్ణీత గడువులో రైతులకు మంజూరు చేయాలని, సకాలంలో ధ్రువపత్రాలు మంజూరు చేయాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, పోలీస్ స్టేషన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

తాగునీటి నమూనాల పరిశీలన

సామర్లకోట: ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీటి నమూనాలను అధికారులు గురువారం రాత్రి పరీక్షించారు. తాగునీటిపై తరుచూ ఫిర్యాదులు రావడంతో ప్రజారోగ్య విభాగం ఈఈ హుస్సేన్ ఆధ్వర్యంలో స్థానిక ఉండూరు రోడ్డులోని ఫిల్టర్ బెడ్ ప్లాంటులో శుద్ధి అయిన నీటిని పరీక్షించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ ఫిల్టర్ బెడ్ నుంచి విడుదల అవుతున్న తాగునీరు స్వచ్ఛంగా ఉన్నదని ఎటువంటి లోపాలు లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె రామారావు, ఇన్‌చార్జి ఏఈ సాగర్, ఫిల్టర్ బెడ్ ఇన్‌చార్జి గిడుతూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఫిల్టర్ బెడ్ వద్ద తాగునీటిని పరీక్షిస్తున్న ఈఈ హుస్సేన్, కమిషనర్ రామారావు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | UMFB బ్రాంచి, తిలక్ స్ట్రీట్, కాకినాడ, ఆంధ్రప్రదేశ్-533001.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1))

తేది : 24.06.2024
ప్రదేశము : కాకినాడ
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, UMFB కాకినాడ